



ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.గౌతమి

'ఆమె'దే నిర్ణయం..!



ఉమ్మడి జిల్లాలో సార్వత్రిక ఎన్నికల సమరం మెల్లమెల్లగా ఊపందుకుంటోంది. అభ్యర్థుల ప్రకటన, ప్రచారాలు ఇలా ఒకదాని తర్వాత ఒకటి వేగంగా జరుగుతున్నాయి. అభ్యర్థులు ఓ వైపు ప్రచారాలు చేస్తూనే మరో వైపు ఓటర్లను ఎలా ప్రసన్నం చేసుకోవాలన్న దానిపై బేరీజు వేస్తున్నారు. ఎవరి ఓట్లు ఎక్కువగా ఉన్నాయి..? వారిని ఎలా ప్రసన్నం చేసుకోవాలన్న పనిలో నిమగ్నం అయ్యారు. ఈ పరిస్థితిలో ఇప్పటి వరకు ఉన్న ఓటర్ల వివరాలను పరిశీలిస్తే చాలా నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో అభ్యర్థులు మహిళా ఓటర్ల మెప్పు పొందేలా ప్రచారంలో మార్పులు చేసుకుంటున్నారు. ఒకరకంగా చెప్పాలంటే ఈ సారి అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చేది మహిళా ఓటర్లే కావడం విశేషం. ఇప్పటి వరకు ఉన్న ఓటర్ల జాబితాను పరిశీలిస్తే ఎక్కువ నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. మొత్తం ఓటర్లలో సగానికి పైగా మహిళలు ఉడడంతో ఈ సారి 'ఆమె' నిర్ణయం గెలుపోటములను నిర్ణయించనుంది.

- నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే అధికం
- గెలుపోటములను నిర్ణయించనున్న మహిళలు
- ఆ ఓట్లపై అభ్యర్థుల గురి

ప్రజాశక్తి-అనంతపురం

గతంలో జరిగిన ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో చాలా నియోజకవర్గాల్లో పురుష ఓటర్లే అధికంగా ఉండేవారు. కానీ ఈ సారి మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా కన్పిస్తోంది. ఓటుపై అధికారులు కల్పించిన ప్రచారాలు, అవగాహన కార్యక్రమాలతో పురుషులతో సమానంగా మహిళలు ఓటును నమోదు చేసుకున్నారు. సగానికి పైగా మహిళా ఓటర్లు ఉండడంతో వారు గెలుపోటములపై ప్రభావం చూపనున్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో నమోదైన ఓటర్ల వివరాలను పరిశీలిస్తే అనంతపురం జిల్లా పరిధిలో రాయదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, తాడిపత్రి, అనంతపురం అర్బన్, కళ్యాణదుర్గం, రాప్తాడు, శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో ధర్మవరం నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు మహిళా ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ప్రత్యేకంగా మహిళలకు తాయిలాలు, కానుకలు ఇవ్వడం ద్వారా ఓట్లు పొందవచ్చనే ఆలోచనలో ప్రధాన పార్టీల నేతలు ప్రణాళికలు రచిస్తున్నారు. ఎన్నికలకు ఇంకా దాదాపు 55 రోజుల సమయం ఉండడంతో మహిళా ఓటర్లు అందరినీ కలిసి ఓటు అభ్యర్థించే విధంగా ప్రచారానికి సిద్ధం అవుతున్నారు. ప్రచారంలో ఏ ఊరికి వెళ్లినా అభ్యర్థులు ముందుగా మహిళలను పలకరిస్తూ ఓటు అభ్యరిస్తున్నారు. తమను ఆదరిస్తే భవిష్యత్తులో మహిళలకు అన్ని విధాలా అండగా ఉంటామనే విధంగా హామీలను గుప్పిస్తున్నారు. ఎన్నికల సమీపించే కొద్ది మహిళా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పెద్ద ఎత్తునే తాయిలాలు అందించేలా అభ్యర్థులు ప్రణాళిలు తయారు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

మహిళలతో ప్రచారాలు

మహిళా ఓటర్లు అధికంగా ఉన్న గ్రామాలు, వార్డుల్లో అభ్యర్థులు మహిళల చేతనే ప్రచారం చేయించేందుకు సిద్ధం అవుతున్నారు. అభ్యర్థి భార్య, కూతురు ఇతర మహిళా కుటుంబ సభ్యులను ప్రచారంలోకి దింపుతున్నారు. ప్రచారంలో ఇళ్ల వద్దకు వెళ్లినప్పుడు పసుపు,కుంకుమ ఇచ్చి తన భర్త లేదా మా నాన్నను గెలిపించండి.. అంటూ మహిళలను ఓటు అభ్యర్థిస్తున్నారు. మహిళలు ఓటు వేస్తామని హామీని ఇస్తే కచ్చితంగా వేస్తారన్న నమ్మకం కూడా అభ్యర్థుల్లో కన్పిస్తోంది. దీంతో మహిళా ఓటర్లకు గాలం వేసి 'ఆమె' చేత గెలిపించుకోవాలని అభ్యర్థులు తపన పడుతున్నారు.



అనంతపురం జిల్లా ఓటర్లు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు
రాయదుర్గం	129090	131736
ఉరవకొండ	109905	112788
గుంతకల్లు	131304	135656
తాడిపత్రి	121499	122562
శింగనమల	122341	123257
అనంతపురం	136761	141679
కళ్యాణదుర్గం	113196	114236
రాప్తాడు	124081	124219
మొత్తం	988176	1006123

శ్రీ సత్యసాయి జిల్లా ఓటర్లు

నియోజకవర్గం	పురుషులు	మహిళా
హిందూపురం	1,23,974	1,22,471
మడకశిర	1,06,242	1,04,831
పెనుకొండ	1,17,310	1,16,369
ధర్మవరం	1,19,086	1,20,451
కదిరి	1,23,742	1,20,451
పుట్టపర్తి	1.04.092	1.05.970
మొత్తం	6,94,446	6,97,119

అన్ని విధాలా ఎన్నికలకు సన్నద్ధం

కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అన్ని విధాలా సన్నద్ధం అవుతున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.గౌతమి తెలియజేశారు. అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం సాయంత్రం సాధారణ ఎన్నికలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని విధాలా సన్నద్ధం అవుతున్నామని తెలిపారు. నామినేషన్ స్వీకరణకు పది రోజుల ముందు వరకు ఫామ్-6 దరఖాస్తులను తీసుకోవచ్చన్నారు.కొత్తగా ఓటు హక్కు నమోదు అవుతున్న వారు, ఎక్కడా ఓటు లేని వారి దరఖాస్తులు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో ఈనెల 19వ తేదీ నాటికి 19,98,841 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఫామ్-6 దరఖాస్తుల పరిశీలన అనంతరం ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. జిల్లాలో 2,213 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 23 సహాయక పోలింగ్ కేంద్రాలతో కలిపి మొత్తం 2,236కి పోలింగ్ కేంద్రాలు చేరుకున్నాయన్నారు. గత ఎన్నికల్లో 90 శాతం కన్నా ఎక్కువగా ఓటింగ్ జరిగిన, మైనస్ 10 శాతం కన్నా తక్కువగా పోలింగ్ జరిగిన, లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తిన అంశాలను పరిగణలోకి తీసుకుని జిల్లాలో 1,032 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను గుర్తించామన్నారు. ఏప్రిల్ 12వ తేదీన ఈవీఎం మొదటి రాండమైజేషన్, మే ఒకటో తేదీన ఈవీఎం రెండవ రాండమైజేషన్ ప్రక్రియను చేపడతామన్నారు. ఇందుకు సంబంధించి పోలింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలను ఏప్రిల్ 4వ తేదీ నుంచి 10వ తేదీ లోపు పూర్తి చేస్తామని తెలిపారు. వాలంటీర్లు రాజకీయ పార్టీలకు సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొనరాదన్నారు. వాలంటీర్లు రాజకీయ పార్టీలతో కలిసి పాల్గొంటే తమ దష్టికి తీసుకువస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని వివరించారు. ఏవైనా ఫిర్యాదులు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1950, జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్ ఫోన్ నెంబర్లు 08554-231722, 08554-231922, 08554-232922కు తెలపవన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు క్యాంపెయిన్, ర్యాలీకి సంబంధించి, వెహికల్, లౌడ్ స్పీకర్, స్కూల్ గ్రౌండ్, ఫ్లాగ్స్, బైక్ ర్యాలీకి సంబంధించి అనుమతి కోసం సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ రవికుమార్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల పాల్గొన్నారు.

'పది' పరీక్ష కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

పదో తరగతి పరీక్ష కేంద్రాలను బుధవారం డిఇఒ బి.వరలక్ష్మీ సందర్శించా రు. ఏర్పాట్లు, సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. డిఇఒ మాట్లాతూ ఉదయం నిర్వహిం చిన హిందీ పరీక్షకు 95 శాతం విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. జిల్లాలో రెగ్యులర్, ప్రయివేట్ విద్యార్థులు మొత్తం 32,208 మంది హాల్ టికెట్స్ తీసుకున్నారన్నారు. మూడో రోజు ఇంగ్లీష్ పరీక్షకు 1743 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. డిఇఒ వెంట పరీక్షల విభాగం ఎసి గోవిందనాయక్ ఉన్నారు.

ఓపెన్ ఇంటర్, టెన్త్ పరీక్షలకు 272 మంది గైర్హాజరు

జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన ఓపెన్ ఇంటర్, టెన్త్ పరీక్షలకు 272 మంది గైర్హాజరైనట్లు డిఇఒ బి.వరలక్ష్మి తెలిపారు. ఓపెన్ ఇంటర్ పరీక్షకు 2,548 మందికి 197, టెన్త్ పరీక్షకు 856 మందికి 75 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

అన్ని వసతులతో స్ట్రాంగ్ రూంల ఏర్పాటు

కలెక్టర్ ఎం.గౌతమి



అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం

ఎన్నికలకు సంబంధించి స్ట్రాంగ్ రూం. కౌంటింగ్ కేంద్రాలు ఇతర అన్నింటికి సంబంధించి ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.గౌతమి అధికారులను ఆదేశించారు. అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో సాధారణ ఎన్నికల కోసం శింగనమల నియోజకవర్గానికి సంబంధించి ఏర్పాటు చేస్తున్న డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌ల్లో ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. అనంతరం నగరంలోని జూనియర్ కళాశాలలో అనంతపురం నియోజకవర్గానికి సంబంధించి ఏర్పాటు చేస్తున్న డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనంతపురం, శింగనమల నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, ఈవీఎంల కమిషనింగ్, స్ట్రాంగ్ రూమ్‌ల కోసం ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ సూచనల ప్రకారం ఏర్పాట్ల విషయమై పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. భద్రతాపరంగా ఎలాంటి ఇబ్బంది లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ సిబ్బందికి సామగ్రిని అందించడంలో ఎలాంటి లోటుపాట్లు ఎదురుకాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్ఒ జి.వెంకటేష్, శింగనమల ఆర్ఒ వెన్నెల శ్రీను, తహశీల్దార్ శివరామిరెడ్డి, డివిఈవో వెంకటరమణ నాయక్, జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సిద్ధేశ్వర ప్రసాద్, ఈఆర్ఒలు, ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి స్టాండింగ్ కమిటీ నియామకం

జిల్లా స్థాయి స్టాండింగ్ కమిటీని నియామకం చేస్తూ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.గౌతమి బుధవారం నాడు ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ ఎన్నికలు-2024కి సంబంధించి అన్ని రాజకీయ పార్టీలు. పోటీ చేసే అభ్యర్థుల మోడల్ కోడ్‌ను పాటించేలా చూసేందుకు, స్వేచ్ఛగా మరియు నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించేందుకు జిల్లా స్థాయి స్టాండింగ్ కమిటీ నియామకం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికలకు సంబంధించి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏ సమావేశం జరిగినా జిల్లా స్థాయి స్టాండింగ్ కమిటీలో ఉన్న ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఈ కమిటీలో ఎం. అంజయ్య, (బీఎస్పీ), షేక్ ఇమామ్ వలి (కాంగ్రెస్), ఎంపి.ఈశ్వర్ ప్రసాద్(బిజెపి), ఎం.బాల రంగయ్య (సిపిఎం), సి.పవన్ కుమార్ (టిడిపి), జి.ఉమాపతి (వైసిపి), షేక్ మసూద్ వలీ, (ఏపిపి)లో స్టాండింగ్ కమిటీని నియమించారు.

23న జెఎన్‌టియు బడ్జెట్‌పై పాలక మండలి సమావేశం



ఉపకులపతి జివిఆర్.శ్రీనివాసరావు

అనంతపురం :

అనంతపురం జెఎన్‌టియు 2024-25 బడ్జెట్‌పై ఈ నెల 23వ తేదీ ఉపకులపతి ఆచార్య జివిఆర్.శ్రీనివాసరావు అధ్యక్షతన పాలక మండలి సమావేశం నిర్వహిస్తున్నట్లు వర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య సి.శశిధర్ బుధవారం తెలిపారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో భాగంగా ప్రధా నంగా ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై సమావేశం ఉంటుందన్నారు. ఇప్పటికే వీటికి సంబంధించిన ఏర్పాట్లను వర్శిటీ రిజిస్ట్రార్ కార్యాలయం, అకౌంట్స్ విభాగం నివేదికలను సిద్ధం చేస్తున్నట్లు రిజిస్ట్రార్ తెలిపారు.

మెడికల్ షాపుల్లో తనిఖీలు

ప్రజాశక్తి-అనంతపురం

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం అధికారులు బుధవారం సంయుక్తంగా నగరంలోని ఐదు మెడికల్ షాపుల్లో సోదాలు చేశారు. అందులో జనతా మెడికల్స్ అండ్ జనరల్ స్టోర్, కీర్తి మెడికల్ స్టోర్, సెవెన్ హిల్స్ ఫార్మసీలో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించినట్లు, హెచ్-1 షెడ్యూల్డ్ రిజిస్టర్ నిర్వహించడం లేదని గుర్తించి కేసుకు నమోదు చేశారు. సోదాల్లో సిఐ వి.వెంకటరమణ, ఎఇఇ ఎల్.రవీంద్రనాథ్, సిబ్బంది రమేష్‌రెడ్డి, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఎడి పి.హనుమన్న పాల్గొన్నారు.



మెడికల్ షాపులో తనిఖీలు చేస్తున్న డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు

అనుమతి లేని మందులు, విత్తనాలు అమ్మితే చర్యలు

రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ కార్యాలయం ఎడిఎ శ్రీనివాసాచార్యులు

ప్రజాశక్తి-అనంతపురం



విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

ఫర్టిలైజర్ షాపుల్లో డీలర్లు అనుమతి లేని మందులు, విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ కార్యాలయ ఎడిఎ శ్రీనివాసాచార్యులు, వ్యవసాయ అధికారి శివరామకృష్ణ హెచ్చరించారు. వారు బుధవారం అనంతపురం వ్యవసాయ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాల కులు ఎం.రవితో కలిసి ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. హెర్బిసైడ్ టోలరెన్స్ పత్తి విత్తనాలను ఎపి ప్రభుత్వం నిషేధించిందని, వాటిని ఎవరైనా అమ్ముతున్నరా అని నగరంలోని బస్టాండ్ రోడ్డులో ఉన్న ఫర్టిలైజర్ దుకాణలను తనిఖీ చేశారు. పలు దుకాణాల్లో అక్కడే పరీక్షలు చేసి పత్తి విత్తనాలను తనిఖీ చేశారు. ఎక్కడా ఆ పత్తి విత్తనాలు లభించలేదు. నకిలీ, హెర్బిసైడ్ టోలరెన్స్ పత్తి విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని దుకాణాలదారులను హెచ్చరించారు. వారి వెంట జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం సాంకేతిక వ్యవసాయ అధికారి రాకేష్‌నాయక్, అనంతపురం వ్యవసాయ అధికారి సాయిలక్ష్మి ఉన్నారు.

కూలీలకు 'ఉపాధి' పనులు కల్పించండి

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని ఎంపీడీవో దస్తగిరి ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధి కూలీలు పనులకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఉదయం 6 గంటలకే పనులకు వెళ్లి 10 గంటలకు ముగించాలన్నారు. మళ్లీ సాయంత్రం పనులకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో ఏపీవోలు చెన్నకేశవులు, భాగ్యలక్ష్మి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పారదర్శక ఎన్నికల నిర్వహణే లక్ష్యం

- మద్యం, డబ్బు, మారణాయుధాలు రాకుండా చెక్‌పోస్టుల ద్వారా అడ్డుకట్ట
- ఎస్పీ కేకేఎన్.అన్బురాజన్



ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను అత్యంత పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడమే తమ లక్ష్యమని ఎస్పీ కేకేఎన్.అన్బురాజన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే ఎన్నికల కోడ్ అమల్లో ఉందన్నారు. ప్రజలు సహకరించి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పకుండా పాటించడంతో పాటు ప్రశాంత ఎన్నికలకు దోహదపడాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా నిరంతర నిఘా, విస్తత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం, డబ్బు, మాదక ద్రవ్యాలు, మారణాయుధాలు జిల్లాలోకి రాకుండా కర్నాటక సరిహద్దుల్లో 20 చెక్ పోస్టులు, జిల్లా సరిహద్దుల్లో 3 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి చెక్‌పోస్టులో నలుగురు సిబ్బంది నిరంతరాయంగా విధుల్లో ఉంటారన్నారు. కర్నాటక నుంచి జిల్లాలోకి వచ్చి వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేయనున్నట్లు తెలియజేశారు. వీటితో పాటు డైనమిక్ చెక్ పోస్టులు నాలుగు ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ పోలీసులు, సెబ్ సిబ్బంది ఉంటూ అక్రమ రవాణాలపై ప్రత్యేక నిఘా ఉంచి తనిఖీలు చేస్తారని తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని సమస్యాత్మక గ్రామాలు, పట్టణాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజలను చైతన్య పరుస్తున్నామన్నారు. ఎన్నికల వేళ ఎలాంటి గొడవలు, అల్లర్లు, హింసకు పాల్పడకుండా దూరంగా ఉండాలని సూచిస్తున్నామన్నారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా కేంద్ర సాయుధ బలగాలతో కవాతు, విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్నికల వేళ ఎవరైనా ప్రలోభపెట్టినా, ఓటర్లు, రాజకీయ పార్టీల నాయకులకు భద్రతాపరమైన ఇబ్బందులు, సమస్యలు ఉంటే తన ఫోన్ నంబర్ 9440796800, లేదా జిల్లా స్పెషల్ బ్రాంచి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగం నెంబర్ 9392918293కు సమాచారం ఇవ్వాలన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ట్రబుల్ మాంగర్స్, రౌడీషీటర్లు, పాత కేసుల్లో నిందితులను పోలీసు స్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ చేపట్టాలని ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్ ఆదేశించారు. ఎలాంటి గొడవలు, నేరాల జోలికెళ్లకుండా గట్టి నిఘా వేయాలన్నారు. సమస్యలు సష్టించే ట్రబుల్ మాంగర్స్, పాత నేర చరిత కల్గిన రౌడీషీటర్ల ప్రస్తుత జీవన విధానం, స్థితిగతులపై ఆరా తీయాలన్నారు. పాత పంథా మళ్లీ పునరావతమైతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించాలన్నారు. ప్రజల్లో భరోసా కల్పించడం కోసమే కేంద్ర సాయుధ బలగాలచే సమస్యాత్మక గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలియజేశారు. బుధవారం జిల్లాలోని యల్లనూరు, ఇటుకలపల్లి పోలీసు స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలచే ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామన్నారు.

కార్మిక హక్కుల సాధనకు ఉద్యమిస్తాం

ప్రజాశక్తి-గుత్తి

కార్మిక హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని వాటి సాధన కోసం ఉద్యమాలు కొనసాగిస్తామని సిఐటియు అనుబంధ సంస్థ, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎటిఎం నాగరాజు పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నాగరాజు మాట్లాడుతూ సమ్మెలో భాగంగా 16 రోజులకు కార్మికులకు వేతనంతో కూడిన హెల్త్ అలవెన్స్‌కు సంబంధించి 21 జీవోను సాధించామన్నారు. కరోనా సమయంలో పనిచేసిన కార్మికులను అన్ని మున్సిపాల్టీల్లో విధుల్లోకి తీసుకున్నారని, గుత్తిలో ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ వరలక్ష్మి, సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి వి.నిర్మల, మున్సిపల్ పారిశుధ్య కాంట్రాక్ట్ కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.రామాంజనేయులు, కె.సూర్యనారాయణ, నాయకులు మహేష్, సుంకన్న, ఈశ్వరయ్య, నాగేంద్ర, అనురాధ, మల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందిస్తున్న మున్సిపల్ కార్మికులు



స్వాధీనం చేసుకున్న నగదు వివరాలను తెలియజేస్తున్న సిఐ మురళీకృష్ణ

ఆధారాలు లేని నగదు స్వాధీనం

ప్రజాశక్తి-తాడిపత్రి

స్థానిక ఆర్టీసీ బస్టాండులో బుధవారం పట్టణ పోలీసులు ఓ ప్రయాణికుడి నుంచి ఎలాంటి ఆధా రాలు చూపని రూ. 12.77 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పోలీసులు లాడ్జిలు, బస్టాండ్, రైల్వేస్టేషన్, అనుమానిత ప్రదేశాల్లో నిరంతరం తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో పట్టణ సిఐ ఎస్.మురళీకృష్ణ, సిబ్బంది, ఫ్లయింగ్ కార్డు ఇన్చార్జి విజయభాస్కర్, వారి సిబ్బంది ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహించగా ఓ వ్యక్తి అనుమానాస్పదంగా అనిపించడంతో తనిఖీ చేశారు. ఆ వ్యక్తి వద్ద ఉన్న చేతి సంచిలో రూ. 12,77,000 నగదు ఉండడంతో అతడిని అదుపులోకి తీసుకు న్నారు. అతడిని కర్నూలు జిల్లా డోన్ మండలంలోని ఆవులదొడ్డి గ్రామానికి చెందిన రామకృష్ణ కుమా రుడు బండికోరి నరేంద్రగా గుర్తించారు. ప్రొద్దుటూరులో బంగారం కొనుగోలు చేసేందుకు డోన్ నుంచి రైలులో వచ్చి ఇక్కడ ఉన్నట్లు ఆ వ్యక్తి తెలిపారు. నగదుకు సంబంధించి సరైన రశీదులు చూపక పోవడంతో అతడిపై కేసు నమోదు చేసి నగదును స్వాధీనం చేసుకుని ఇన్‌కంట్యాక్స్ అధికారులకు అప్పజెప్పినట్లు సిఐ తెలిపారు.



విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న సమితి సభ్యులు

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

రాయదుర్గం : పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు బుధవారం పట్టణంలోని పరీక్ష కేంద్రం వద్ద జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కావలి ఈశ్వర్, పట్టణ వైస్ ప్రెసిడెంట్ రుద్ర పాల్గొన్నారు. పరీక్ష కేంద్రం బయట పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు.

ఆక్రమణకు గురైన బోరును స్వాధీనం చేసుకోవాలని వినతి

నార్పల : మండలంలోని జంగంరెడ్డి పల్లి గ్రామంలో శివాయి సాగుభూమిలో గ్రామ తాగునీటి అవసరాల కోసం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో వేసిన బోరును పక్క భూమి రైతు తన పొలంలో కలిపేసుకున్నాడు. ఆక్రమణకు గురైన బోరును స్వాధీనం చేసుకొని ప్రజల సౌకర్యార్థం ఉపయోగించి గ్రామంలో నీటి ఎద్దడిని నివారించాలని కోరుతూ బుధవారం సిపిఎం, సిపిఐ మండల కార్యదర్శులు కుళ్లాయప్ప, గంగాధర ఆధ్వర్యంలో తహశీల్దార్ నారాయణ స్వామి, ఎంపిడివో రాముడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐఆర్‌డి శైలజారాణి, వామపక్ష నాయకులు పెద్దపెద్దయ్య, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు

నేడు ఆలయ హుండీ లెక్కింపు

పామిడి : పట్టణంలో వెలసిన భోగేశ్వర చెన్నకేశవస్వామి ఆలయ హుండీలను గురువారం దేవా దాయ శాఖ అధికారులు, ఆలయ పాలక మండలి, అర్చకుల సమక్షంలో తెరిచి లెక్కిస్తామని ఇఒ కృష్ణయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు పంచె, పై పంచె ధరించి పాల్గొనవచ్చ న్నారు. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు రాముస్వామి, కమిటీ ఛైర్మన్ మురళీధర్ గుప్తా, చంద్రస్వామి, అనిల్‌స్వామి, అప్పన్నస్వామి, పురుషోత్తంస్వామి పాల్గొంటా రన్నారు.

వడదెబ్బతో ఎద్దు మృతి.. రైతుకు రూ. 50వేలు నష్టం

గుత్తి : మండలంలోని కరిడికొండ గ్రామంలో బుధవారం తన ఎద్దు వడదెబ్బతో మృతి చెందినట్లు బాధిత రైతు జిట్టా చిరంజీవి ఆవేదన వ్యక్తం చేశాడు. వివరాలు.. రైతు వ్యవసాయ పనుల కోసం కాడెద్దులు కొనుగోలు చేశా డు. వాటిని మంగళవారం రాత్రి ఇంటి ఆవరణలో కట్టి ఉంచాడు. బుధవారం వేకువజామున ఎద్దుకు మేత వేసేందుకు వెళ్లగా ఓ ఎద్దు నేలపై పడి ఉండగా పరిశీలించడంతో మృతి చెందినట్లు గుర్తించారు. ఎద్దు మృతితో రూ. 50వేలు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతు న్నాడు. అలాగే రెవెన్యూ అధికారులు, వెటర్నరీ వైద్యులకు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపాడు.

ఆలయ ముఖద్వారం నిర్మాణానికి భూమిపూజ

గుత్తి : పట్టణంలోని మహర్షి గురుకుల పాఠశాల ఎదురుగా కాశీ విశ్వేశ్వర ఆలయ ముఖ ద్వారం నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. 9వ వార్డులో ఉన్న పురాతన కాశీ విశ్వేశ్వర ఆలయం ఏటా మహాశివ రాత్రితో పాటు ప్రతి సోమవారం భక్తులతో కిటకిట లాడుతోంది. ఈ ఆలయ అభివృద్ధి, గుర్తింపు కోసం కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నూతన ముఖద్వారం నిర్మాణానికి పూనుకున్నారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ కన్వీనర్ హుస్సేన్ పీరా, నాయకులు జీపు రమణ, గగారిన్ కొమరవ్, ప్రధాన అర్చకులు రమణస్వామి పాల్గొన్నారు.

వినాయకుని విగ్రహ ప్రతిష్ఠాపన

బెళుగుప్ప : మండలంలోని తగుపర్తి గ్రామంలో రూ. 10 లక్షలు విరాళాలు సేకరించి వినాయకుడి నూతన ఆలయం నిర్మించారు. ఆలయంలో బుధవారం వేద పండితులు హోమాలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ గంగ నీరు తెచ్చి వినాయక విగ్రహానికి జలాభిషేకం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి భజన ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

'గురుకులం' ప్రవేశ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

నార్పల : ఇటీవల జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షల్లో స్థానిక షిర్డీ సాయి విద్యాలయం(ఆనంద్) విద్యార్థులు ప్రతిభ చాటారు. మేకల వినయ్ 50/50 మార్కులు సాధించి జిల్లాలో మొదటి ర్యాంకు సాధించాడు. నార్పల గారబాయి కొట్టాల కాలానికి చెందిన గరుగు రమేష్, రత్నమ్మ దంపతుల కుమారుడు గరుగు వంశీ, రొట్టెల మహమ్మద్ 49/50 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరి ప్రతిభ పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఇదే మండలంలోని గుంజేపల్లి పాఠశాలలో స్నేహ 46/50, మనోజ్ 29/50 మార్కులు సాధించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు కోదండరావు, వెంకటేష్ ప్రత్యేక కోచింగ్ ఇవ్వడం ద్వారా విజయం సాధించినట్లు విద్యార్థులు తెలిపారు. మారుమూల గ్రామం నుంచి గురుకులం పాఠశాలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ఓటర్లకు అవగాహన

పుట్లూరు : మండలంలోని గాండ్లపాడు, తక్కలపల్లి గ్రామాల్లో బుధవారం ఎన్నికల అధికారులు ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలనే విషయంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు వెంకటరామిరెడ్డి, శ్రీధర్, భాస్కర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సైకిల్‌కు ఓటేసి టిడిపిని గెలిపించండి

శింగనమల అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ



ప్రచారం చేస్తున్న బండారు శ్రావణిశ్రీ, ఆలం నరసానాయుడు

ప్రజాశక్తి-నార్పల

వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సైకిల్‌కు ఓటేసి టిడిపిని గెలిపించాలని శింగనమల టిడిపి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ కోరారు. ఆమె బుధవారం మండలంలోని గూగూడు గ్రామంలో కుళ్లాయి పీర్ల చావిడి, ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. అంతకుముందు ప్రజలు ఆమెకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆమె రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానా యుడుతో కలిసి ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్, మినీమేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి, వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. శ్రావణశ్రీ, ఆలం నరసానాయుడు మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో శింగనమల నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగరవేసి చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కి గిఫ్ట్‌గా ఇస్తామని ధీమా వ్యక్తం చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి మరుగున పడిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే నియోజవర్గంలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎర్రినాగప్ప, ఆంజనేయులు, అనిల్, రవితేజ, ప్రతాప్‌చౌదరి, చంద్రబాబు, జాఫర్‌వలి, రాజన్న, ఓబులేసు, నరసింహులు, రాజేష్, రాజుగౌడ్, రామకృష్ణ, నాగేంద్ర, నాగేష్, రామకృష్ణ, వెంకటరాముడు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం అభివృద్ధే లక్ష్యం : 'అమిలినేని'



కార్యకర్తలతో మాట్లాడుతున్న అమిలినేని సురేంద్రబాబు

ప్రజాశక్తి-కుందుర్పి

కళ్యాణదుర్గం నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు. ఆయన బుధవారం కుందుర్పి, బెస్తరపల్లి గ్రామాల్లో కార్యకర్తలతో పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పార్టీ బలోపేతం, విజయమే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలను కోరారు. కళ్యాణదుర్గం అభివృద్ధి చెందాలంటే అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కాగా బెస్తరపల్లిలో ఓ టిడిపి సీనియర్ నాయకుడిని కలవడానికి వెళ్లగా ఆయన సమక్షంలోనే తెలుగు తమ్ముళ్ల మాటల యుద్ధానికి దిగడంతో ఆయన నిరాశగా వెనుదిరిగినట్లు తెలుస్తోంది. కార్యక్రమంలో మండల కన్వీనర్ ధనుంజయ, నాయకులు మల్లికార్జున, రామాంజనేయులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

టిడిపి గెలుపుతో భవిష్యత్తుకు బంగారు బాటలు



విజయసింహాకు స్వాగతం పలుకుతన్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-బెళుగుప్ప

వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించుకుని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకుందామని టిడిపి అభ్యర్థి పయ్యావుల కేశవ్ తనయుడు విజయసింహా పిలుపునిచ్చారు. మండలంలోని తగుపర్తి గ్రామం లో బుధవారం నిర్వహించిన 'బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో ఆయన పాల్గొ న్నారు. ముందుగా విజయసింహాకు గ్రామస్తులు, మహిళలు పూలమాలలు వేసి హారతులు పట్టి పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికారు. ఆయన నూతనంగా నిర్మించిన వినాయకుని ఆలయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. టిడిపి ప్రకటించిన సూపర్ సిక్స్, మినీమేనిఫెస్టో కరపత్రాలు అందజేశారు. ఎన్నికల్లో పయ్యావుల కేశవ్‌ని అఖండ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

నగరంలో పారిశుధ్యం మెరుగవ్వాలి : కమిషనర్



పార్కును పరిశీలిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో పారిశుధ్యం పనులు మెరుగవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన బుధవారం నగరంలోని బిందెలవారి కాలనీ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. మురుగు నీటిని పూర్తిగా తరలించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాని సంబంధిత ఇంజనీర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. మధ్యాహ్నం రాజీవ్ చిల్డ్రన్ పార్క్, నీరు ప్రగతి పార్కును సందర్శించారు. ప్రజలు ప్రతిరోజూ పార్కులను సందర్శించి ఆటవిడుపు పొందేలా వసతులు కల్పించాలన్నారు. చెట్ల సంరక్షణలో నిర్లక్ష్యం వహించినా, ఫిర్యాదు అందినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం హౌసింగ్ బోర్డు, అశోక్ నగర్ ప్రధాన రహదారుల్లో అభివృద్ధి పనులను పరిశీలించి నాణ్యత, తదితర విషయాలపై ఆరా తీశారు. కాలిటీ కంట్రోల్ నివేదిక తప్పనిసరిగా జతపరచాలని ఈఈని ఆదేశించారు. ఆయన వెంట అసిస్టెంట్ ఇంజినీర్ బాబావలి, హార్టికల్చర్ ఆఫీసర్ లక్ష్మీప్రసన్న, సచివాలయ సిబ్బంది, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు

టిడిపిలో పలువురు చేరిక




గుమ్మనూరు ఈశ్వర్, నారాయణస్వామి సమక్షంలో టిడిపిలో చేరిన నాయకులు

ప్రజాశక్తి-పామిడి

మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్, సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి సమక్షంలో పలువురు వైసీపీ నాయకులు టిడిపిలో చేరారు. మండలంలోని వైసీపీకి చెందిన 50 కుటుంబాలు బుధవారం పామిడిలోని సోమశేఖర్ ఫ్యాక్టరీలో టిడిపిలోకి చేరగా ఈశ్వర్, నారాయణస్వామి వారికి టిడిపి కండువాలు వేసి ఆహ్వానించారు. పట్టణంలోని సోమశేఖర్, నిమ్మకాయల శీన, నిమ్మకాయల ప్రసాద్, పసుల నాగరాజు, భోగేశ్వర్, సుబ్బారెడ్డి, పూల దొడ్డన్న, బాలు, హోటల్ గోవిందు, తదితరులు టిడిపిలో చేరారు. వారు మాట్లాడుతూ వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలతో విసిగిపోయామని, టిడిపితోనే తమకు భవిష్యత్తు ఉంటుందని గ్రహించి పార్టీలో చేరామని తెలిపారు. గుమ్మనూరు ఈశ్వర్, గుమ్మనూరు నారాయణస్వామి మాట్లాడుతూ కొత్తగా పార్టీలోకి వచ్చామన్న భావన వద్దని, అందరితో కలిసి టిడిపి విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్ చౌదరి, జింకల సంజీవ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్దేహాల్‌లో 'కాలవ' ప్రచారం



ఉద్దేహాల్‌లో ప్రచారం చేస్తున్న కాలవ శ్రీనివాసులు

బొమ్మనహాల్ : మండలంలోని ఉద్దేహాల్ గ్రామంలో బుధవారం రాయదుర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆయన స్థానిక పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళి సూపర్‌సిక్స్, మినీమేని ఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించి టిడిపికి ఓటు వేయాలని అభ్యర్థించారు. విలేకరులతో మాట్లాడుతూ ఆర్థిక ఉగ్రవాది జగన్ ఎపిలో అభివృద్ధిని 20ఏళ్ల వెనక్కి తీసుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని లేని రాష్ట్రంగా చేశాడన్నారు. రహదారులు పూర్తిగా ధ్వంసమైపోయా యన్నారు. సాగునీటి ప్రాజెక్టులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. రాష్ట్రం మళ్లీ అభివృద్ధి పథంలో పరుగులు తీయాలంటే టిడిపిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బలరామిరెడ్డి, చలపతి, జగన్ మోహన్ రెడ్డి, కేశప్ప, తిప్పేస్వామి, సంగప్ప, హనుమంతు, అనిల్, బాబు, కేశవరెడ్డి, తిమ్మరాజు, రవి, మహేంద్ర ఉన్నారు.

కాంగ్రెస్‌పార్టీలో పలువురు చేరిక

బొమ్మనహాల్ : మండలంలోని ఉంతకల్లు గ్రామంలో వెలసిన రుక్మిణి పాండురంగస్వామిని బుధ వారం కాంగ్రెస్‌పార్టీ నాయకుడు చిన్నబ్బాయి దర్శించుకున్నారు. అనంతరం కురుబ రవి ఇంటి వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టిడిపి, వైసిపికి ఓటు వేస్తే బిజెపికి వేసినట్లే అన్నారు. ఎపికి తీవ్ర అన్యాయం చేసిన బిజెపి, వైసిపి, టిడిపి నాయకులను గ్రామాల్లోకి రానివ్వొద్దని ప్రజలకు సూచించారు. అనంతరం వైసిపి కార్యకర్తలు శంకరప్ప, వన్నూరుస్వామి, మారెన్న, పొన్నూరప్ప, ఉపేంద్ర, నాగరాజు, శేఖర్, కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కోడుమూరు టిడిపి పరిశీలకునిగా రామలింగారెడ్డి

శింగనమల : బుక్కరాయసముద్రం మండలానికి చెందిన టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి కర్నూలు జిల్లాలోని కోడుమూరు నియోజవర్గ పార్టీ పరిశీలకునిగా బుధవారం నియమితులయ్యారు. కోడుమూరు నియోజవర్గంలో పార్టీ పరిస్థితి, వచ్చే ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి గెలుపు కోసం పార్టీలో కార్యకర్తలు, నేతలను సమన్వయం చేసుకుని ముందుకుసాగేలా రామలింగా రెడ్డిని పరిశీలకులుగా వేసినట్లు తెలిపారు. ఆయన గురువారం కోడుమూరు వెళ్లనున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే సాయం

ఉరవకొండ : విడపనకల్లు మండలంలోని గాజుల మల్లాపురంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా హరిజన లింగన్న గుడిసె పూర్తిగా కాలిపోయింది. స్థానిక వైసిపి నాయకులు ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన రూ. 47 వేలు ఇచ్చారు. ఆ మొత్తాన్ని బుధవారం వైసిపి నేత లింగన్న బాధిత కుటుంబ సభ్యులకు అందజేసి పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు భరత్‌రెడ్డి, శంకర్‌గౌడ్, ఎద్దుల వన్నారెడ్డి, ఎ.వన్నారెడ్డి, షణ్ముఖ్‌గౌడ్, డిష్ వెంకటేష్ పాల్గొన్నారు.

శింగనమలలో పోలీసు కవాతు

శింగనమల : సిఐ శ్రీధర్, ఎస్ఐ చిదంబరప్ప ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం శింగనమలలో కేంద్ర పోలీ సు బలగాలు, సివిల్ పోలీసులు కవాతు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు బిఎస్ఎఫ్, సెంట్రల్ పోలీస్ ఫోర్స్ భద్రత భరోసా ఉంటుందని తెలియజేసేందుకు కవాతు నిర్వహించామన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలన్నారు. ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలన్నారు.

నేరాలు ఘోరాలు

హత్యాయత్నం కేసులో రెండేళ్ల జైలు

అనంతపురం క్రైం : అనంతపురం టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో 2018 సంవత్సరంలో జరిగిన హత్యాయత్నం కేసులో ఒకరికి రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమాన విధిస్తూ అనంతపురం పీఎస్‌జె కోర్టు తీర్పు వెలువరించింది. స్థానిక రహమత్ నగర్‌కు చెందిన ఉమా మహేష్ వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవించేవాడు. ఈయనకు 06–12–2018న రహమత్ నగర్‌కు చెందిన మహమ్మద్ ముషాదిక్‌తో చిన్నపాటి వాగ్వాదం తలెత్తింది. ఇదే కారణంతో మహమ్మద్ ముషాదిక్ ఉమామహేష్‌ను కత్తితో దాడి చేసి గాయపరిచాడు. ఈఘటనపై స్థానిక టూటౌన్ పోలీసు స్టేషన్లో హత్యాయత్నం కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్ఐ ఎం.బలరామరావు దర్యాప్తు పూర్తి చేసి ఛార్జిషీటు దాఖలు చేశారు. ఈకేసులో అన్ని కోణాల్లో విచారించిన పీఎస్‌జె కోర్టు జడ్జి ధీన బుధవారం నాడు నిందితుడి రెండేళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమాన విధిస్తూ తీర్పు వెలువరించారు. దర్యాప్తు అధికారి ఎస్ఐ ఎం.బలరామరావు, పిపి వెంకట్రామిరెడ్డి, కోర్టు మానిటరింగ్ సిబ్బంది ఎఎస్సై కృష్ణ, కానిస్టేబుళ్లు కుమార్, రామకృష్ణలను ఎస్పీ కేకేఎన్.అన్బురాజన్ అభినందించారు.

హుండీ చోరీకి యత్నించిన దొంగ పట్టివేత

రాయదుర్గం : పట్టణంలోని ఓబుళాచారి రోడ్డులో ఉన్న బన్నీ మహంకాళి ఆలయం వద్ద బుధవా రం ఓ దొంగ హుండీలోని సొమ్ము చోరీకి ప్రయత్నించి పట్టుబడ్డాడు. తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఓ యువకుడు పైకప్పు రేకును తొలగించి ఆలయం లోపలికి ప్రవేశించాడు. హుండీ తాళం తెరిచి చోరీకి ప్రయత్నిస్తుండగా అప్పటికే అమ్మవారి దర్శనార్థం వచ్చిన భక్తులకు గమనించి అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

మందుల దుకాణంలో చోరీ

గుత్తి : గుత్తి ఆర్ఎస్‌లోని ఓ మందుల దుకాణంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. హాజీ మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ దుకాణం షట్టర్ తాళాలను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి లోపలికి చొరబడి రూ.10వేలు నగదు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

జూదరులు అరెస్టు

పుట్లూరు : మండలంలోని కడవకల్లు గ్రామంలో జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ హేమాద్రి ఆధ్వర్యంలో దాడులు చేశారు. కడవకల్లు గ్రామంలోని బాల వెంకట్ రెడ్డి అరటి తోటలో జూదం ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ. 9,380 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

కళ్యాణదుర్గం : ఎన్నికల నేపథ్యంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని రూరల్ సిఐ నాగరాజు ఎస్ఐ ఆంజనేయులు హెచ్చరించారు. బుధవారం నాడు కంబదూరు పోలీస్ స్టేషన్ వద్ద మండలంలోని రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎన్నికల దష్ట్యా గ్రామాల్లో శాంతి భద్రతలకు భంగం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పీడీ యాక్టు నమోదు చేసి బైండోవర్ చేస్తామన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు.

బైండోవర్

పుట్లూరు : మండలంలో రౌడీ షీట్ నమోదైన వారిని, మద్యం బెల్ట్ షాపు నిర్వాహకులను బుధవారం ఎస్సై హేమాద్రి స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇకపై ఎలాంటి నేరాల్లో పాల్గొన కూడదని హెచ్చరించారు. వారికి తహశీల్దార్ కార్యాలయం తీసుకెళ్లి తహశీల్దార్ మల్లికార్జునస్వామి ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

పుట్లూరు : మండలంలోని ఎ.కొండాపురం గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. పెద్దపప్పూరు మండలంలోని తిమ్మన్నచెరువు గ్రామానికి చెందిన మహేశ్వర్‌రెడ్డి ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా సీజ్ చేసి మైన్స్ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు.

ప్రజా సంక్షేమ పాలన వైసిపితోనే సాధ్యం : ఎమ్మెల్యే

అనంతపురం : ఎపిలో ప్రజా సంక్షేమ పాలన వైసిపితోనే సాధ్యమని ఎమ్మెల్యే అనంత వెంకట రామిరెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే బుధవారం నగరంలోని 20వ డివిజన్‌లో 'ఇంటింటికీ వైసీపీ' కార్యక్ర మం నిర్వహించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి వైసిపి సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో జరిగిన అభి వృద్ధిని ప్రజలకు వివరించారు. సంక్షేమ పాలన జగన్‌తోనే సాధ్యమని కావున మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఆయన వెంట వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

ఆత్మకూరు : మండలంలోని బి.యాలేరు గ్రామం మాజీ ఎంపిటీసీ సభ్యుడు కురాకుల శంకరనారాయణ రెడ్డి (చిన్నా)తో పాటు 20 కుటుంబాలు టిడిపిని వీడి బుధవారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సమక్షంలో వైసిపీలో చేరారు. కురాకుల శంకరనారాయరెడ్డికి ఎమ్మెల్యే వైసిపి కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారిలో తలారి కర్రి చెంద్రాయుడు, కురుబ విశ్వనాథ్, చాకలి ఈశ్వరయ్య, బద్దలాపురం పోతన్న, కమ్మరి పరమేశ్వరి, కమ్మరి అనిత, హరిజన వేపకుంట లింగన్న, హరిజన నల్లప్ప, హరిజన నాని, హరిజన కొరివి శంకరయ్య, ఎం.వంశీ, తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పప్పూరు పాఠశాల, ఆసుపత్రి పరిశీలన

నార్పల : మండలంలోని పప్పూరు ఉన్నత పాఠశాల, ప్రాథమిక వైద్యశాలను బుధవారం ఎంపిడీవో రాము డు సందర్శించారు. పాఠశాలలో 300 మంది విద్యార్థులు ఉన్నారని, బోరు పని చేయకపోవడంతో విద్యార్థులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని హెచ్‌ఎం రాధరాణి ఫిర్యాదు చేయగా స్పందించిన ఎంపిడీవో, ఇఒఆర్‌డి శైలజరాణి పాఠశాలకు వెళ్లి బోరును పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి వెంటనే బోరును మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ప్రాథమిక వైద్యశాలను సందర్శించి వైద్యులు మహేంద్ర, జహీరాతో మాట్లాడుతూ ఓపి, తదితర వివరాలపై ఆరా తీశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. బండ్లపల్లి, బొందలవాడ సచివాలయాలను సందర్శించి ఎన్నికల నియమావళి అమలును పర్యవేక్షించారు.

చలివేంద్రం ప్రారంభం

గుత్తి : పట్టణంలోని పురావస్తు శాఖ కార్యాలయ ప్రాంగణంలో గుత్తి కోట సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ చలివేంద్రాన్ని బుధవారం సిపిఐ సీనియర్ నాయకులు సూర్యనారా యణరెడ్డి ప్రారంభించారు. ప్రారంభం రోజున మజ్జిగ, శీతల పానీయాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయ డం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంకు ఉపాధ్యక్షులు కె.రామ్మోహన్, గుత్తి కోట సంరక్షణ సమితి గౌరవాధ్యక్షులు కోనా నిశాంత్‌రెడ్డి, నాయకులు చిరంజీవి, హెచ్.ఎం.జిలాన్, హెచ్.ఎం.హర్షద్, పురావస్తు శాఖ సిబ్బంది ఎంటీఎస్.షారున్, అమృత్‌బాబు, శ్రీరాములు, పర్వీన్ బేగం పాల్గొన్నారు.

నార్పల ఎస్ఐకి సన్మానం

నార్పల : మండలంలోని గూగూడు గ్రామంలో దళితులపై జరిగిన దాడిపై వెంటనే స్పందించి ఎఫ్ఐఆర్ (నాన్ బెయిలబుల్ సెక్షన్) నమోదు చేసి రిమాండ్‌కు పంపి బాధితులకు న్యాయం చేసిన ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డిని బుధవారం ఎస్సీ, ఎస్టీ ప్రజా సమాఖ్య ఆధ్వర్యంలో సన్మానించారు. ముఖ్యఅతిథిగా ఎస్సీ, ఎస్టీ ప్రజా సమాఖ్య వ్యవస్థాపకులు మద్దెలచెరువు మల్లి, జిల్లా అధ్యక్షులు ఎం.పెద్దిరాజు హాజరయ్యారు. కార్యక్రమంలో తుంపిరి శివయ్య, దుర్గమ్మ, ఓబుళప్ప, మీసాల ఎర్నాగప్ప, విభూతి రమేష్, రామాంజనేయులు, పవన్, కుళ్లాయప్ప, కాటమయ్య, అనంతయ్య పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన

అనంతపురం : నగర శివారలోని అనంతలక్ష్మీ ఇంజినీరింగ్ కళాశాల జాతీయ సేవా పథం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో బుధవారం ఇటుకలపల్లి గ్రామంలో స్పెషల్ క్యాంపు నిర్వహించారు. విద్యార్థులు గ్రామస్తులకు వడదెబ్బకు కారణాలు, దాని వల్ల కలిగే అనర్థాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామ్మూర్తి, ఎన్ఎస్ఎస్ అధికారి ఖలీల్‌బాషా, నవీన్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు గార్లదిన్నెలో శ్రావణిశ్రీ ఎన్నికల ప్రచారం

గార్లదిన్నె : శింగనమల నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ గురువారం మండలంలోని కృష్ణాపురం, ఇల్లూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఉదయం 7 గంటలకే ప్రచారం ప్రారంభిస్తారని, మండలంలోని టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని వారు కోరారు.